జర్నలిస్ట్
# వార్త
RNI NO :Title-Code :-TELTEL02102
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
జర్నలిస్ట్ వార్త KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

ప్రచురణ : హైదరాబాద్, శుక్రవారం 5-1 -2024 సంపుటి :01 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ సంచిక : 110 పేజీలు : 4 వెల : 5-00

## ఢిల్లీలో బిజీగా సింఎం రేవంత్ పర్యటన

**- పలువురు కేంద్రమంత్రులతో భేటీ**
**-రాష్ట్ర సమస్యలపై ప్రస్తావన**




**న్యూఢిల్లీ,జనవరి4 జర్నలిస్ట్ వార్త**
ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా కొనసాగుతోంది. కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. అంతకు ముందు కేంద్ర పట్టణ అభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు.. విభజన అంశాలు, నిధుల రాకపై చర్చించారు. అ తర్వాత కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావాత్ తోనూ రేవంత్ భేటీ అయ్యారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వాలని వినతిపత్రం అందించారు.సీఎం రేవంత్ తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జాయింట్ డైరెక్టర్ ఆమ్రపాలి ఉన్నారు. అలాగే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి గురువారం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఉదయం 11 గంటలకు ఏఐసీసీ కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు.

## నాడు కారు..సారు..పదహారు

- ఇప్పడేమో తెలంగాణ సెంటిమెంట్
-బిఆర్ఎస్‌ను ఆదరిస్తే ప్రజలకు వచ్చే లాభం
-రెండు జాతీయ పార్టీలను కాదని ఓటేస్తారా?



**హైదరాబాద్,జనవరి4 జర్నలిస్ట్ వార్త**
గత పార్లమెంట్ ఎన్నికల్లో 9మందిని గెలిపించారు. సారు..కారు..పదహారు అన్న నినాదంతో ముందుకు వెళ్లగా 9మందిని గెలిపించారు. బిజెపికి నలుగురిని, కాంగ్రెస్‌కు ముగ్గురిని, ఎంఐఎంకు ఒక్కరిని గెలిపించారు. 9మందితో గులాబీ బాస్ ఏం సాధించారు. మొక్కుబడిగా వినతిపత్రాలు ఇచ్చి మిన్నకున్నారు. కేంద్రాన్ని నిలదీసి ఒక్కటంటే ఒక్క పని చేయించలేదు. లోపాయకారి ములాఖాత్‌లు తప్ప ఒరిగిందేమీ లేదు. అలాంటి వారు మళ్లీ పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి ఏం సాధిస్తారు. ప్రజలు వీరిని గెలిపించి..ఓటును దుర్వినియోగం చేసుకోవడం తప్ప చేసేదేమీ లేదు. తెలంగాణ బలం.. తెలంగాణ గళం.. తెలంగాణదళం పార్లమెంట్‌లో ఉండాలని అంటున్న కెటిఆర్.. గతాన్ని నెమరేసుకుంటే మంచిది. తెలంగాణ ప్రయోజనాల కోసం రాజీలేకుండా కొట్లాడాలంటే.. తెలంగాణ ప్రయోజనాల కోసం పేగులు తెగేదాక అవసర మైతే నిలబడాలి.. కలబడాలంటే బీఆర్‌ఎస్‌కి మాత్రమే అని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదం.

అంతగా బలం ఉండి చేసిందేమీ లేదు. సొంత పనులు చేసుకోవడం, అధికార దర్పం వెలగబెట్టడం తప్ప మరోటి ఉండదు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో కెసిఆర్ సిఎంగా లేనందుకు ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు.

## స్కూళ్లకు 12 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు

**ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ విద్యాశాఖ**




హైదరాబాద్,జనవరి4 **జర్నలిస్ట్ వార్త** తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు స్కూళ్లు సెలవులు ప్రకటించింది. తిరిగిన 18వ తేదీ నుంచి స్కూల్స్ ప్రారంభం కానున్నాయి. అంటే మొత్తం ఆరు రోజుల పాటు విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్లన్నింటికీ ఈ సెలవులు వర్తిస్తాయి. ప్రైవేట్ స్కూల్ సెలవులు ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు అధికారులు. జనవరి 12న సాధారణ సెలవు కాగా, 13వ తేదీ రెండో శనివారం, 14వ తేదీన భోగి, 15న సంక్రాంతి, 16వ తేదీన కనుమ పండుగ ఉన్నాయి. 17న సాధారణ సెలవు ఇచ్చారు. మొత్తంగా ఆరు రోజులు సెలవులు ఇచ్చారు. ఇక జనవరి 29వ తేదీ నుంచి స్కూల్ విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్-4 పరీక్షలను నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. స్కూళ్లతో పాటు.. ఇంటర్మీడియట్ కాలేజీలకూ సెలవులు ప్రకటించింది విద్యాశాఖ. జనవరి 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సెలవులు ఇచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలన్నీ దీనిని పాటించాలని ఆదేశించారు




## బిసిల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- వారికిచ్చే ఉచిత విద్యుత్ కొనసాగుతుంది
- ఇచ్చిన హామీల అమలకు కృషి చేయాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం




## బిసిలకు అండాదండా టిడిపియే

- వచ్చే ఎన్నికల్లో 160 సీట్లు టిడిపి గెలుస్తుంది
- జగన్ రెడ్డిని బంగాళాఖాతంలో కలపడం ఖాయం
- టిడిపి బిసి సదస్సులో అచ్చన్నాయుడు వెల్లడి




## కాంగ్రెస్‌లో చేరిన వైఎస్ షర్మిల




- రాహుల్ సమక్షంలో కండువా కప్పిన ఖర్గే
- కాంగ్రెస్ అతిపెద్ద సెక్యులర్ పార్టీ అన్న షర్మిల
- పార్టీ ఆదేశిస్తే..అండమాన్ వెళ్లమన్నా వెళతా
- తండ్రి వైఎస్ అడుగుజాడల్లో నడుస్తానని ప్రకటన
- రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్నదే కోరిక

**న్యూఢిల్లీ,జనవరి4 జర్నలిస్ట్ వార్త**
ఎట్టకేలకు వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీల సమక్షంలో షర్మిల కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. షర్మిల చేరికతో కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్టీపీ విలీనం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు, పలువురు నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో షర్మిల చేరికతో గత కొద్దిరోజులుగా వస్తున్న వార్తలకు తెరబడింది.కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని, కాంగ్రెస్‌లో వైఎస్సార్టీపీని విలీనం చేశామని షర్మిల అన్నారు. కాంగ్రెపార్టీ ఏ బాధ్యత ఇచ్చినా నిబద్ధతో పనిచేస్తానని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గొప్ప నేత అని అన్నారు. ఆయన ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశ లూ శ్రమించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోనే అతిపెద్ద సెక్యులర్ పార్టీ అని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకుంటూ, అందరినీ కలుపుతూ పని చేస్తుందన్నారు. ఒక క్రిస్టియన్‌గా మణిపూర్‌లో చర్చిల కూల్చివేత తనను తీవ్రంగా బాధించిందన్నారు. సెక్యులర్ పార్టీ అధికారంలో లేకపోతే ఏం జరుగుతుందనడానికి ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీపై నమ్మకాన్ని తనతో పాటు ప్రజలందరిలో పెంచిందన్నారు. తెలంగాణలో కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ఉద్దేశంతో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించి పోటీ చేయలేదని వెల్లడించారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నది తన తండ్రి వైఎస్సార్ ఆశయమని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

## కెసిఆర్‌కు జగన్ పరామర్శ

**ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు రాక**



**హైదాబాద్,జనవరి4 జర్నలిస్ట్ వార్త**
బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను ఏపీ సీఎం వైఎస్ జగన్ గురువారం పరామర్శించారు. ప్రత్యేక విమానంలో తాడేపల్లి నుంచి బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆయనకు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం బంజారాహిల్స్ లోని నందినగర్ లో కేసీఆర్ నివాసానికి జగన్ చేరుకున్నారు. అక్కడ జగన్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం, కేసీఆర్ ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కాగా, ఇటీవలే కేసీఆర్ తన ఫామ్‌హౌజ్ లో జారిపడడంతో తుంటి ఎముక విరిగిన విషయం తెలిసిందే. సోమాజీగూడ యశోద ఆస్పత్రిలో ఆయనకు వైద్యులు హిప్ రీప్లేస్మెంట్ సర్జరీ చేశారు. అనంతరం కొద్ది రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం గాయం నుంచి కోలుకుంటున్నారు. సీఎం కేసీఆర్ ను పరామర్శించిన అనంతరం సీఎం జగన్ లోటస్ పాండ్‌కు వెళ్లారు. దాదాపు రెండేళ్ల తర్వాత జగన్, లోటస్ పాండ్ లో నివాసానికి వెళ్లనున్నారు.

## భారత్ సైన్యాన్ని తొలగించకపోతే మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది..



# భారత్ సైన్యాన్ని తొలగించకపోతే మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది..




హిందూ మహాసముద్ర ద్వీపసమూహం నుంచి భారత్ తన బలగాలను ఉపసంహరించుకోకుంటే తమ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జూ అన్నారు. భారత సైన్యం మాల్దీవుల్లోనే కొనసాగితే మాల్దీవుల ప్రజల 'ప్రజాస్వామ్య సంకల్పాన్ని' విస్మరించినట్లేనని ఆయన పేర్కొన్నారు. మాల్దీవుల జాతీయ రక్షణ దళం యొక్క కార్యాచరణను పెంపొందించే ప్రయత్నాలతో సహా భారతదేశంతో రక్షణ సహకారానికి ఆయన మద్దతు ఇచ్చారు. మాల్దీవులలో భారతదేశం యొక్క శాశ్వత సైనిక ఉనికిని మహమ్మద్ ముయిజ్జూ తిరస్కరించాడు. భారతదేశంతో మల్దీవులు పరస్పర చర్చల ద్వారా సైనిక ఉనికి సమస్యను పరిష్కరించుకుంటామని ముయిజ్జూ తెలిపారు. పార్లమెంటరీ ఆమోదం లేకుండా విదేశీ సైనిక సిబ్బంది మాల్దీవుల్లో ఉండటం రాజ్యాంగ ప్రాథమిక స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. మాల్దీవులకు అనుకూల విధానాన్ని మాత్రమే తాము అనుసరిస్తున్నట్లు చెప్పాడు.. భారత్‌కు వెళ్లే ముందు చైనాను సందర్శించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. మేము ఏ దేశానికీ వ్యతిరేకంగా ఉండము అని మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జూ తెలిపారు. మాల్దీవుల ప్రయోజనాలను రక్షించడంతో పాటు ప్రో-మాల్దీవుల విధానాన్ని మార్గనిర్దేశం చేసే సూత్రం అని ఆయన అన్నారు.. శాంతి, భద్రతను ప్రోత్సహించడానికి ప్రపంచ ప్రజా ప్రయోజనాల కోసం పోరాడుతామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 77 మంది భారతీయ సైనికులు మాల్దీవులలో మోహరించారు. వీరిలో 24 మంది హెలికాప్టర్ల నిర్వహణకు, 25 మంది డోర్నియర్ విమానాల నిర్వహణకు, 26 మంది ఇతర హెలికాప్టర్ల నిర్వహణకు వినియోగించారు. వీరే కాకుండా మెయింటెనెన్స్ తో పాటు ఇంజినీరింగ్ కోసం మరో ఇద్దరు భారతీయ సైనికులు ఉన్నారు. సెప్టెంబరులో జరిగిన ఎన్నికల్లో గెలిచిన తర్వాత ముయిజ్జూ భారతీయ సైనికులను వెనక్కి పంపాలని ప్రకటించారు.

# బిసిల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

హైదరాబాద్,జనవరి4 రజక, నాయి బ్రాహ్మణల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సెలూన్, లాండ్రీ, ధోబీఘాట్‌లకి విద్యుత్ అధికారులు కనెక్షన్ కట్ చేయరని, ఎవరు అధైర్యపడవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి లాండ్రీలు, ధోబీ ఘాట్‌లు, హెయిర్ కటింగ్ సెలూన్‌లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఆర్థికశాఖ బడ్జెట్‌ను విడుదల చేయాలని ఈ మేరకు మంత్రి కోరారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమానుగతంగా తప్పకుండా అమలు చేస్తుందని హామీనిచ్చారు. ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా బీసీలకు విద్య, ఉపాధి అవకాశాల్లో కల్పనలో కృషి చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు అధికారులను ఆదేశించారు. తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ పనితీరుని, ప్రస్తుతం ఉన్న గురుకుల విద్యాలయాలు, బీసీ కార్పొరేషన్ రుణాలు, ఆత్మగౌరభవనాలు, ఫెడరేషన్లకు సంబంధించిన అనేక విషయాలను ఈ సమావేశంలో మంత్రి సమీక్షించారు. సంక్షేమాన్ని ప్రజలకు అందించటం ఒక అదృష్టంగా భావించి అధికారులందరూ బీసీల సామగ్రాభివృద్ధి కోసం, నిరుపేద లైన బీసీ ప్రజల సంక్షేమనీ, వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడం కోసం నిబద్ధతతో పని చేయాలని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించడానికి అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. బిసి సంక్షేమ శాఖలోని హాస్టల్లో విద్యార్థుల సంఖ్య , అవసరమైన నిధులు , వసతుల గురించి, రాష్ట్రంలోని స్టడీ సర్కిల్స్లో ఇస్తున్న కోచింగ్ గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. గురుకుల పాఠశాలల పనితీరు, విద్యార్థులు సాధిస్తున్న ఉత్తీర్ణత శాతం గురించి మంత్రి సమీక్షిం చారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం ,అడిషనల్ సెక్రెటరీ పద్మ, ఎంబీసీ సీఈఓ అలోక్ కుమార్, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు, చంద్రశేఖర్, సంధ్య, విమల, శ్రీనివాస్ రెడ్డి , మద్దిలేటి, మంజుల, ఉదయ్ ప్రకాష్, తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఇసుక మేటలతో ఇబ్బందులు

## - ఫలితంగా నీరు నిల్వలకు దెబ్బ

కాకినాడ,జనవరి4 ప్రతి ఏడూ నదిలో డ్రెడ్జింగ్ పనులు జరక్కపోవడంతో ఇసుకమేటలు వేస్తున్నాయి. ఫలితంగా నీరు నిల్వలు ఉండట్లేదు. దీనికి తోడు ఎత్తిపోతల పథకాల నిర్వహణ కూడా సరిగా లేకపోవడంతో ఇవి అక్కరకు రాకుండా పోతున్నాయి. ప్రస్తుతం గోదావరిలో నీటి నిల్వలు అడుగంటడంతో రబీకి నీరు అందట్లేదు. అంగులూరు క్వారీకొండ వరకు వచ్చిన నది అక్కడి నుంచి రెండు పాయలుగా విడిపోయింది. ఎక్కువ భాగం పశ్చిమకు పోగా, మిగిలినది తూర్పు వైపున పారుతోంది. తొర్రిగడ్డ ఎత్తిపోతలు ఆ ప్రదేశంలోనే నిర్మించడంతో నదిలో నీటిమట్టం ఎప్పుడూ 14 మీటర్లకు తగ్గక నిరాటకంగా నీరు అందుతుందని అధికారులు తెలిపారు. ఉన్న పథకాలన్నింటిలో అక్కడే ఎక్కువ లోతు ఉందన్నారు.
పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా రబీలో మెట్టకు నీటి విడుదలకు అవకాశమే లేదు. ఒక ఏడాది రబీలో తొర్రిగడ్డ ఎత్తిపోతల ద్వారా మొక్కజొన్న పంటకు నీరివ్వని విషయం తెలిసిందే. ఇప్పుడు మెట్టకు పుష్కర 1,2 పథకాల ద్వారా నీరిచ్చే ప్రసక్తే లేదని యంత్రాంగం పేర్కొంది. కొత్తగా చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే ప్రస్తుతం పోలవరం, పుష్కర పథకాల కాల్వల్లో చుక్క నీరు ఉండకూడదు. ఉన్న నీటినే ఎక్కడికక్కడే తోడివేయాల్సి ఉంటుంది. వర్షాలు ఎక్కువగా ఉండటం, గోదావరికి వరదలు ఉండటంతో ఎత్తిపోతల పథకాల కిందకు నీరు అందుతుంది. అనంతరం నీటి నిల్వలు లేకపోవడంతో ఎత్తిపోతల పథకాలు పనికిరాకుండా ఉంటున్నారు. జనవరి నుంచి మే వరకు 8 పంపుసెట్లను ఓవరాయిలింగ్ చేసి మరమ్మతులు పూర్తి చేసి జూలైకు మెట్టకు నీరు విడుదల చేసే పనిలో ఉన్నామని అధికారులు వివరించారు.

# రైతాంగాన్ని పట్టించుకోని మోడీ

## - కాంగ్రెస్ మాత్రమే దేశానికి రక్ష



నిజామాబాద్,జనవరి4 రైతుల పంట ఉత్పత్తులపై ఎంఎస్‌పీ ధరపై 20శాతం బోనస్ అధికంగా చెల్లించాలని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు రైతులకు పండగ అంటూ వరాలు ప్రకటించిన మోడీ ఇప్పుడు రైతాంగం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఏటా మద్దతు ధరల కోసం ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగిన పట్టింపు లేదన్నరు. ప్రజలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వ పాలన సాగుతోందని అన్నారు. నోట్ల రద్దు తర్వాత 50 రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని చెప్పారని ఎంత మంది నల్లకుబేరులను బయటకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో మళ్లీ దేశానికి కాంగ్రెస్ పరిపాలన అవసరమని గుర్తించారని చెప్పారు. సామాన్యులు, పేదలు పడుతున్న ఇబ్బందులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజల్లో ఎండగడుతామని అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రోజు కూలీ, కార్మికులు, పేదలు, సామాన్యులపై ప్రభావం పడిందన్నారు. పదేళ్లు కావస్తున్నా కష్టాలు గట్టెక్కలేదన్నారు. ఏవర్గంకూడా ఆనందంగా లేదని, రాహుల్ నాయకత్వంలో రాష్ట్రంలో లాగేనే దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని షబ్బీర్ అలీ అన్నారు.

# మామిడి రైతులు సలహాలు తీసుకోవాలి

సంగారెడ్డి,జనవరి4: మామిడి సాగు చేసిన, సాగుచేసే రైతులు ఉద్యానశాఖ అధికారులు ఇచ్చే సూచనలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం మంచుతో పూత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తుగా సంరక్షణ చర్యలు చేపడితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. రబీ పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించడంలో జిల్లా అన్నదాతలు పెద్దగా స్పందించడం లేదు. ఇప్పటి వరకు ముందుకు వచ్చిన రైతుల సంఖ్య తక్కువగా ఉంది. గతంతో పోలిస్తే రుణాలు తీసుకోని రైతులు ఆసక్తి కనపరచలేదు. దేశ వ్యాప్తంగా కూడా రబీ పంటలు సాగు చేసి రుణాలు తీసుకోని రైతులు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రాని వారి సంఖ్య ఎక్కువగా ఉంది. రబీ కాలంలో జిల్లా వ్యాప్తంగా బోరు బావులు, బావులు, కాలువల కింద ప్రధానంగా వేరుసెనగ, వరి, మినుము, నువ్వులు,
పొద్దు తిరుగుడు, పసుపు, వర్షాధారం కింద జొన్న, తదితర పంటలతో పాటు ప్రధానంగా పేరుకు రబీ అయినా వర్షాధారం కింద అన్ని పంటల కంటే ఎక్కువగా శనగ సాగు చేశారు.

# ఢిల్లీ వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి

## వెంటవెళ్లిన సిఎస్, డిజిపి



హైదాబాద్,జనవరి4 :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. చీఫ్ సెక్రటరీ సహా ముఖ్యమైన కొందరు అధికారులను వెంటబెట్టుకుని వెళ్లడంతో ఆయన ఢిల్లీ పర్యటనపై ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి వెంట వెళ్లిన అధికారుల బృందంలో చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, డీజీపి రవిగుప్తా తదితరులు ఉన్నారు. రేవంత్ ఈనెల 14న దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. ఈలోగా కొన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు సమాచారం. ఎవరికి పదవులు ఇవ్వాలనే విషయాన్ని అధిష్ఠానంతో ఆయన చర్చించ నున్నారు. గురువారం ఢిల్లీలో జరిగే ఏఐసిసి సమావేశంలోనూ ఆయన పాల్గొంటారు. పార్లమెంటు ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అన్ని రాష్ట్రాల పిసిసి అధ్యక్షులు, సిఎల్పీ నాయకులు కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు. రాహుల్ గాంధీ త్వరలో చేపట్టబోయే భారత న్యాయ యాత్రపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

# బిసిలకు అండాదండా టిడిపియే

అమరావతి,జనవరి4 2024 ఎన్నికల్లో 160 స్థానాలకు పైగానే తెలుగుదేశం గెలవబోతోందని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. జగన్ రెడ్డిని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బడుగు,బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీనేనని అచ్చెన్నాయుడు అన్నారు. బిసిలంతా తెలుగుదేశం జెండా కింద ఎదిగిన వారేనని అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జయహో బీసీ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా టీడీపీ అధినేత చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. బీసీలు టీడీపీ వెంట ఉన్నారనే అక్కసుతో జగన్ రెడ్డి దండయాత్ర చేస్తున్నాడు. బీసీలను రాజకీయంగా అణగతొక్కేందుకు రిజర్వేషన్లు 20 శాతానికి తగ్గించిన జగన్ రెడ్డి పెద్ద దగాకోరు. జగన్ రెడ్డి ఇచ్చిన కార్పొరేషన్ చైర్మన్ పదవులు నాలుక గీసుకోడానికి కూడా పనికిరావు. కార్పొరేషన్ల ద్వారా బడుగుల్లో ఒక్కరికైనా రుణం ఇచ్చినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పు కుంటాను. మంత్రి చెల్లుబోయిన .. జగన్ చిన్నాన్న పాదాల దగ్గర కూర్చుని బలహీన వర్గాల పరువు తీశాడు. కోడిగుడ్డు అమర్నాథ్‌కు టికెట్ కూడా ఇవ్వలేదు. రాష్ట్రం నలుదిక్కులనూ విజయసాయి, వేమిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డి, సజ్జలకు జగన్ రాసిచ్చాడు. జగన్ రెడ్డి తన సొంత సామాజిక వర్గానికే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇస్తూ బడుగు, బలహీన వర్గాలను అణగతొక్కుతున్నాడు. సబ్ ప్లాన్ నిధుల దారిమళ్లింపు, ఆదరణ పథకాలను రద్దు చేసిన జగన్ రెడ్డి బీసీ ద్రోహి. జగన్ రెడ్డి అరాచక పాలనపై ప్రశ్నించినందుకు
నన్ను 75 రోజులు జైల్లో పెట్టాడు. యనమల, అయ్యన్న సహా ఎందరో నేతలపై అక్రమ కేసులు బనాయించి వేధించిన జగన్ రెడ్డిని సాగనంపాల్సిందే. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే తమ బతుకులు బాగుపడతాయని ప్రజలు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారందరికీ అవకాశాలు కల్పిస్తాం. జగన్ రెడ్డి పాలనలో బీసీలకు జరిగిన అన్యాయంపై క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తాం. ప్రతి పార్లమెంటు పరిధిలో జయహో బీసీ సభలు పెడతాం. చంద్రబాబు, లోకేష్ ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# నాలుక కరచుకుని.. .క్షమాపణలు

## రాముడు మాంసాహారి అంటూవిపరీత వ్యాఖ్యలు

ముంబై,జనవరి4 రాముడు మాంసాహారి అంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్సీపీ నేత జితేంద్ర అవద్ ఎట్టకేలకు క్షమాపణలు చెప్పారు. తాను ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని అనుకోలేదని చెప్పారు. తన వ్యాఖ్యల పట్ల ఎవరైనా బాధపడితే క్షమించాలని కోరారు. మహారాష్ట్రలోని షిర్డీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జితేంద్ర అవద్ శ్రీరాముడు శాఖహారి కాదని మాంసాహారేనని అన్నారు. 14 ఏళ్ల పాటు అడవిలో వనవాసం ఉన్న వ్యక్తి శాకాహారం కోసం ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠాపన మహోత్సవానికి ముందు జితేంద్ర అవద్ చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. ఈ క్రమంలో బీజేపీ నేతలతో పాటుగా హిందువులు ఆయనపై మండిపడుతున్నారు. హిందువులు ఆదర్శపురుషునిగా భావించే శ్రీరామునిపై ఇలాంటి నీచమైన కామెంట్స్ చేసిన తేంద్రపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర సీఎం దీనిపై స్పందించాలన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ ఈ వాదనలను తీవ్రంగా ఖండించారు, రాముడు తన వనవాస సమయంలో ఫలాలు తినేవాడని చెప్పారు. రాముడిని అవమానించేలా కించపరిచే విధంగా జితేంద్ర అవద్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

# అనుమతిలేని ఆధార్ కేంద్రం

## తాండూరులో సీజ్ చేసిన అధికారులు

వికారాబాద్,జనవరి4: తాండూరులో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని సీజ్ చేశారు. తాండూరు తహసీల్దార్ తారాసింగ్ సమక్షంలో కేంద్రంలోని సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తాండూరు పట్టణంలోని సీసీఐ కాలనీలో సొంత ఇంటిలో జిరాక్స్ సెంటర్ పెట్టాడు. అయితే జిరాక్స్ సెంటర్ నడుపుతూ.. మరోవైపు అనుమతులు లేకుండ ఆధార్ సెంటర్ ను కూడా నిర్వహిస్తున్నాడు. అయితే ఈ విషయాన్ని గమనించిన స్థానికులు తాండూరు తహసీల్దార్ తారాసింగ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ సైట్ ను అక్రమంగా డౌన్ లోడ్ చేసి.. ఆధార్ తో అక్రమ వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. దీంతో బుధవారం(జనవరి 03) తహసీల్దార్ తారాసింగ్ ఆర్ఐ రాజిరెడ్డితో కలిసి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా కేంద్రం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం అందులో ఉన్న కంప్యూటర్, స్కానర్ ప్రింటర్ల తదితర సామాగ్రిని సీజ్ చేసి.. తాసిల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు పొందిన తరువాతే ఆధార్ సెంటర్ నిర్వహించాలని అధికారులు స్పష్టం చేశారు.

# యోగిని, రామమందిరాన్ని పేల్చేస్తాం

లక్నో,జనవరి4 ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయోధ్యలో నిర్మించిన రామ మందిరంతో సహా సీఎంను పేల్చేస్తామంటూ
కొందరు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు వారు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. రామమందిరం ప్రాణ ప్రతిష్ఠకు సమయం దగ్గరపడుతున్న సమయంలో ఈ బెదిరింపులు రావడం దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ బెదిరింపులతో అప్రమత్తమైన యూపీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.
సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఆధారంగా నిందితులు ఓం ప్రకాశ్, తాహర్ సింగ్‌గా గుర్తించారు. ఈ మేరకు ఆ ఇద్దర్నీ అరెస్ట్ చేశారు. గోండాకు చెందిన వీరిద్దరూ పారామెడికల్ ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తున్నారని

# రికార్డుస్థాయిలో గోధుమల దిగుబడి

## - కేంద్ర ప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ,జనవరి4: వాతావరణ పరిస్థితులు సాధారణంగా ఉన్న పక్షంలో 2023-24 పంట కాలంలో గోధుమల దిగుబడి రికార్డు స్థాయిలో 11.4 మిలియన్ టన్నులకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర ఆహార మంత్రిత్వశాఖ ఉన్నతాధికారి ఒకరువెల్లడించారు. రబీలో ప్రధాన పంట అయిన గోధుమల నాట్ల చివరి దశ ప్రస్తుతం కొనసాగుతోందని, మరో వారం రోజుల పాటు ఇది కొనసాగుతుందని ఆయన చెప్పారు. అధికారిక గణాంకాల ప్రకారం 320.54 లక్షల హెక్టార్లలో వరి నాట్లు జరిగినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2022-23 పంట కాలంలో గోధుమల దిగుబడి రికార్డు స్థాయిలో 110.55మిలియన్ టన్నులు ఉందని, అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 107.7 మిలియన్ టన్నులు అధికమని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సిఐ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ కె మీనా విలేకరులకు తెలిపారు.
ఈ ఏడాది గోధుమల సాగుబడి పూర్తి విస్తీర్ణం ఈ ఏడాది పెరుగుతుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేవుడి దయవల్ల వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే గోధుమల దిగుబడి 11.4 మిలియన్ టన్నులు ఉండగలదని ఆయన అన్నారు. ఇదే విషయాన్ని వ్యవసాయ శాఖ తమకు తెలిపిందని ఆయన చెప్పారు. గోధుమల రైతులందరికీ కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. గత ఏడాది కన్నా కనీస మద్దతు ధర 7 శాతం పెరగడంతో పెద్ద సంఖ్యలో రైతులు ఎఫ్‌సిఐకి తమ పంటను ఇవ్వడానికి ఇష్టపడుతున్నారని ఆయన చెప్పారు. గత ఏడాది 26.2 మిలియన్ టన్నుల గోధుమలను ఎఫ్‌సిఐ సేకరించింది. ఏప్రిల్ నుంచి గోధుమ పంట కోతలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.ం

# బిఆర్ఎస్ పార్టీకి నోటీసులు

## - ఛానల్ తొలగించాలని ఆదేశాలు

హైదరాబాద్,జనవరి4 బీఆర్ఎస్ పార్టీ భవన్‌కు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయంలో టీ న్యూస్ ఛానల్ ద్వారా వ్యాపారం చేయడంపై నోటీసులు ఇచ్చారు. పార్టీ ఆఫీస్ నుంచి టీ న్యూస్ ఛానల్‌ను ఎప్పటిలోగా షిఫ్ట్ చేస్తారో వారంలోగా వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ భవన్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డిని రెవెన్యూ అధికారులు నోటీసులో పేర్కొన్నారు. కాగా 2011 నుంచి టీ న్యూస్ ఛానల్‌ను యాజమాన్యం బీఆర్ఎస్ భవన్‌లోనే నిర్వహిస్తున్నారు

# అసెంబ్లీ ఎన్నికల్లో సాయం కోసం జగన్ తంటాలు

## - కెసిఆర్‌ను కలవడంలో మతలబు ఇదే : నారాయణ




హైదరాబాద్,జనవరి4 ఏపీఅసెంబ్లీ ఎన్నికల్లో సాయం కోసమే జగన్, కేసీఆర్ దగ్గరకు వచ్చారని ఏపీ సీఎం జగన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను కలవడం పై సీపీఐ నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల కోసమే జగన్, కేసీఆర్ దగ్గరకి పరామర్శకు వచ్చారని విమర్శించారు. కేసీఆర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రయత్నించి జగన్ విఫలమ్యాయరని చెప్పారు. గురువారం నారాయణ మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ రోజు నాగార్జునసాగర్‌లో లేని గొడవ సృష్టించి జగన్, కేసీఆర్‌కు లాభం చేకూర్చాలని ప్రయత్నించారని ఆరోపించారు. జగన్‌లో మెదటసారి ఓటమి భయం కన్పిస్తుందని.. అందుకే చంద్రబాబుపై ఆరోపణలు చేస్తున్నారని నారాయణ అన్నారు. ఇంట్లో కుంపటి వ్యాఖ్యలు చేసి.. జగన్ తన ఓటమిని ఒప్పుకున్నారని నారాయణ అన్నారు. తన ఇంట్లో జగనే గొడవ సృష్టించుకుని ఇతరులను నిందిస్తున్నారన్నారు. చెల్లిని, బాబాయ్‌ను దూరం చేసుకున్నారని.. అధికారానికి కూడా దూరమవుతారని జోస్యం చెప్పారు. పొత్తు పేరుతో చంద్రబాబును బీజేపీ నష్టపరచాలని చూస్తోందని అన్నారు. తమను ప్రశ్నించిన వారిని కేంద్రం 17ఏ పేరుతో బెదిరిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు, జగన్‌ను కూడా 17ఏతో బీజేపీ భయపెట్టిస్తోందని నారాయణ అన్నారు. ఓట్ల కోసమే మాజీ సీఎం కేసీఆర్‌ను జగన్ కలిశారని విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో సాయం కోసమే జగన్.. కేసీఆర్ దగ్గరకి వచ్చారన్నారు. కేసీఆర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ప్రయత్నించి జగన్ విఫలమయ్యారన్నారు.

# నియోజకవర్గ ప్రజల మధ్యలోనే ఉంటా..!

– సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తా

– మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్



పర్వతగిరి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలం కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ 2013లో నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో 2014 భాద్యతలు చేపట్టి, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయం వరకు ప్రజలకు సేవలందించానని మాట్లాడారు. ముచ్చటగా మూడవసారి ఘన విజయం సాధిస్తామని ఆలోచనలో ఉండగా ప్రజల తీర్పు ఆయన ఆలోచనలను తిప్పికొట్టింది. ఐనప్పటికీ వర్ధన్నపేట ప్రజలను వదిలి పోయే ప్రసక్తే లేదంటున్నారు. ప్రాణం ఉన్నంత వరకు వర్ధన్నపేట ప్రజల మధ్యలోనే ఉంటా..సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానని వాగ్దానం చేస్తున్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కుమార్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు సర్వర్, ఎంపిపి కమల పంతులు, పిఏసిఎస్ చైర్మన్ మనోజ్, దేవేందర్, వైస్ ఎంపిపి రాజేశ్వర్ రావు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి, మండల రైతు బందు కో ఆర్డినేటర్ శ్రీను, మాజీ మార్కెట్ డైరక్టర్ ఏకాంతం గౌడ్, మాజీ జెడ్పీటీసీ రాములు, సీనియర్ నాయకులు భాస్కర్ రావు, వెంకటేశ్వర్ రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామశాఖ అద్యక్షులు, మాజీ సర్పంచులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఎన్నాళ్ళయింది..?ప్రజల్ని ఆకర్షించే విధంగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ నాయకులంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన నుంచి తప్పుకుని ఎంతకాలం అవుతుందో మాజీ ఎమ్మెల్యే గమనించాలని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సరిగ్గా ఒక్కనెల రోజులు మాత్రమే పూర్తి చేసుకుంది. ఈలోపు నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఏం సమస్యలు ఏర్పడ్డాయి, ఎక్కడి సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానని వాగ్దానం చేస్తున్నారో చూడాలంటున్నారు.

**తనకొచ్చిన అవకాశాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలి**

వర్ధన్నపేట నియోజకవర్గంలో అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా స్థానికులు మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఉండగా 2014 ఎన్నికల్లో అరూరికి వర్ధన్నపేట ప్రజలు పట్టం కట్టారు. ఒక్కసారి ఆ సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకోవాలని స్థానిక నేతలు అంటున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సెంటిమెంట్, ఇంటికొక ఉద్యోగం వస్తుంది. తమ బతుకులు మారుతాయని మొక పరిచయంతో పని లేకుండా మెజార్టీ అందించి ఆశీర్వదించారు. మరోసారి అదేవిధంగా ఏదో చేస్తారని ఎదురు చూసిన ప్రజలు 2018 ఎన్నికల్లో భారీగా మెజార్టీ అందించారు. 2024 ఎన్నికల్లో అదే ప్రజానీకం ఓడించడానికి కారణమేంటో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న అరూరిని ఓడించి, 2014 మాదిరిగా మరోసారి పరిచయం లేని కాంగ్రెస్ నాయకులు పోలీస్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి గెలిచినప్పుడే వర్ధన్నపేట ప్రజల అభిప్రాయం అర్థమవుతుంది. మాజీ ఎమ్మెల్యేపై ప్రజలకున్న విశ్వాసం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంటే మళ్లీ ఆకర్షించే వృధా ప్రయత్నాలు చేస్తున్నారు. పదవి కోల్పోయిన పరిస్థితిలో ఒక్కనెలలోపు సమస్యలపై పోరాడుతానని వాగ్దానం చేయడం హాస్యకరమని స్థానికులు భావిస్తున్నారు. ఒకవేళ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో సమస్యలు ఉన్నట్లయితే అవి ఎవరి నిర్లక్ష్యానికి నిదర్శనం అవుతాయని ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికుల అభిప్రాయపడుతున్నారు. ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించిన మాత్రాన ప్రయోజనం ఏముందని చర్చ సాగుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా స్థానిక ప్రజా ప్రతినిధులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి అర్థం అవుతుంది. అధికార పార్టీ కండువా కప్పుకోవాలని సందిగ్ధంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు ఉన్నట్లు తెలుస్తోంది. చిట్ట చివరికి ఆ పార్టీలో ఎంతమంది మిగిలి ఉంటారో వేచి చూడాల్సిందే మరి..

## వీరభద్ర దేవాలయం బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

– రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




భీమదేవరపల్లి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన వీరభద్ర దేవాలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమకొండ అదనపు జిల్లా కలెక్టర్ మహేందర్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా దేవాలయానికి విచ్చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని దేవాలయ కార్యనిర్వాహన అధికారి కిషన్ రావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశించారు. రోడ్ల మరమ్మత్తులపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. జాతర నాలుగు రోజుల్లో ఉన్నందున త్వరగా భక్తులకు సకల ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను కోరారు. అదనపు కలెక్టర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఏ విధమైన సౌకర్యాలకు ఆటంకం లేకుండా విధులు నిర్వహించాలని అధికారులను కోరారు. అత్యంత వైభవంగా నిర్వహించే జాతర వేడుకల్లో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు చెల్లించుకుంటారు. అలాంటి సమయంలో భక్తులకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం బ్రహ్మోత్సవాల పోస్టర్, దేవాలయ బ్రహ్మోత్సవ ఆహ్వాన శుభ పత్రికను విడుదల చేశారు .ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వివిధ శాఖల అధికారులు, దేవాలయ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ పరిధిలోని 11వ, వార్డులో వైస్ చైర్మన్ కోమండ్ల ఎలెందర్ రెడ్డి అధ్యక్షతన గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారెంటీ పథకాల అమలులో భాగంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వార్డు ప్రజలు సమర్పించిన దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపల్ కమీషనర్ ఇ. జోనా తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని వార్డుల వారిగా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, సరైన నివేదికను తయారుచేసి, ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. అర్హులైన వారు ఎలాంటి గాబరా పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ రాం నర్సయ్య వ్యవసాయ అధికారి, రంగయ్య మండల విద్యాశాఖ అధికారి, వార్డు కౌన్సిలర్ సమ్మెట సుధీర్, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, గోదావరిఖని జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: 42వ డివిజన్ కళ్యాణ్ నగర్ రాజస్థాన్ భవన్ లో గురువారం ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హాజరై కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న తీరు అక్కడ ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండ, దరఖాస్తులు స్వీకరిస్తూ ప్రజాపాలన కార్యచరణ కొనసాగించాలన్నారు. ప్రజలు వారి యొక్క దరఖాస్తులను అధికారులు తీసుకుని, ప్రజలకు ఏదైనా అనుమానాలుంటే నివృత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నగర మేయర్ బండి అనిల్ కుమార్, 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్ రావు, డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్ రావు, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు అంగన్వాడి టీచర్లు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 2024 క్యాలెండర్ ఆవిష్కరించిన పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ యూత్ ప్రెసిడెంట్ కొండేటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జట్టి కృష్ణంరాజు, కొండేటి రోహిత్, కొండేటి భార్గవ్, బొక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

**జిడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా**



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ కుడా కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, శానిటేషన్, హెల్త్ విభాగాల అధికారులతో గురువారం జిడబ్ల్యుఎంసి కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడబ్ల్యుఎంసి కి సంబందించిన సమస్యలను పరిష్కరి చడానికి వివిధ శాఖల సమన్వయం అవసరమన్నారు. బల్దియా వ్యాప్తంగా అనధికార నిర్మాణాలు జరగకుండా, రహదారులను ఆక్రమించి ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విస్తరణ క్రమంలో టిడిఆర్ పెండింగులో ఉండకుండా చూడా లని సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రభుత్వ భవనాలకు సంబంధించిన పన్నుల వసూళ్లు, వీధి వ్యాపారులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి పోలీసు, ట్రాఫిక్ వారి సహకారం అవసరమన్నారు. విద్యుత్ సరఫరాలో అవాంతరాలను నిరోధించడానికి ఎన్పిడిసిఎల్ వారి సహకారంతో ఇట్టి సమాచారం బల్దియాకు అందజేయడం వల్ల ప్రజల సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. వీధి వ్యాపారులు ట్రాఫిక్ పరంగా ఎదుర్కొనే సమస్యలకు మెప్మా వారి సహకారంతో త్వరితగతిన పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొమ్మటి సాంబయ్య



పరకాల, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మటి రాజు అనారోగ్యతో మృతి చెందారు. గురువారం సమాచారం తెలుసుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు, వరంగల్ పార్లమెంట్ కంటెస్టెంట్ ఎంపీ దొమ్మటి సాంబయ్య సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. అనంతరం రాజు పార్థివ దేహాన్ని సందర్శించి, పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ పాడి కల్పనా ప్రతాప్ రెడ్డి, ఎన్.ఎస్.యు.ఐ అల్ ఇండియా కోఆర్డినేటర్ మార్క అభినవ్ గౌడ్, మాజీ సర్పంచ్ అల్లం రఘు నారాయణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: మున్సిపల్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాలను గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలోని సమస్యలపై అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు పిల్లలందరూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. ముఖ్యంగా బాలికలు రాష్ట్రం, జిల్లాను మొదటి స్థానంలో ఉండేలా బాగా చదివి పేరు తీసుకోవాలని రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలేందర్, కౌన్సిలర్ సమ్మెట సుధీర్, టౌన్ అధ్యక్షులు కుమారస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కమ్మగొని ప్రభాకర్ గౌడ్, మహమ్మద్ చోటు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, ఎండి అప్సర్, మున్సిపల్ కమిషనర్ జోన, ఏ.వొ, ఎమ్మార్వో, ఎంఈఓ, స్కూల్ ప్రిన్సిపల్ , టీచర్లు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్పి పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**- జెండా ఆవిష్కరించిన నాయకులు**



మహబూబాబాద్, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లా కేంద్రం కోర్టు అంబేద్కర్ సెంటర్ ఓసి క్లబ్ ముందు మహాజన సోషలిస్ట్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అధ్యక్షులు పోలెపాక ఎల్లయ్య మాదిగ అధ్యక్షతన 10 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ మహబూబాద్ జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాజన సోషలిస్ట్ పార్టీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 2014 జనవరి 4వ, తేదీన ఆవిష్కృతమైందన్నారు. ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసి వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, పేదవారికి ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొచ్చిన ఏకైక పార్టీ మహాజన సోషలిస్ట్ పార్టీ అన్నారు. ఈ పార్టీ రానున్న రోజులలో అనేక పోరాటాలు చేసి, ఈ తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టే దిశగా ప్రయాణం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహాజన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మిడతపల్లి యాకన్న మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగపొంగు శ్రీనివాస్ మాదిగ, ఉపాధ్యక్షులు మిరియాల శ్రీనివాస్ మాదిగ, ఎండి పాషా తీగల ప్రేమ్ సాగర్ మాదిగ, కార్యదర్శి కందిపాటి బిక్షపతి మాదిగ, పాటి వెంకటేశ్వర్లు మాదిగ, మహాజన మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఎండి రజియా బేగం మాదిగ, మహిళా జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక మాదిగ, ఎం.ఎస్.పి జిల్లా అధికార ప్రతినిధి బోడ సుమిత్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రేణుక మాదిగ, మహిళ జిల్లా అధికార ప్రతినిధి మంద సావిత్రి మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకులు కొమిరి రమేష్ మాదిగ, గుండెపాక నర్సయ్య మాదిగ, మాదిగ మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిల్ల కృష్ణవేణి మాదిగ, గడ్డమీది కవిత మాదిగ, వేల్పుల మంజుల మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ బి కే గ్రామస్థాయి వ్యవసాయ, ఉద్యాన విస్తరణ అధికారులకు శిక్షణా కార్యక్రమం

కందుకూరు :కృషి విజ్ఞాన కేంద్రం కందుకూరు సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా. జి. ప్రసాద్ బాబు కందుకూరు వ్యవసాయ డివిజన్ ఏ డి ఏ అనసూయ ఆధ్వర్యంలో కందుకూరు, వలెటివారి పాలెం, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాల ఆర్ బి కే గ్రామ వ్యవసాయ , ఉద్యాన సహాయకులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమము గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.జి. ప్రసాద్ బాబు మాట్లాడుతూప్రస్తుతం సాగులో వున్న పొగాకు, శనగ, వేరుశనగ, మినుము , మిరప పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై సూచనలను వివరించారు. ప్రస్తుతం పొగాకులో లద్దె పురుగు, ఆకుమచ్చ తెగులు, వేరుశనగలో మొదలుకుళ్ళు, వేరుకుళ్ళు, మిరపలో ఆకుముడత, వైరస్ తెగుళ్లు ఉన్నాయని వాటి నివారణకు చేపట్టవలసిన సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించి ఆ సమాచారాన్ని రైతులకు తెలియజేయాలనీఅన్నా రు.

# ఓఎన్‌జీసీ చేతికి 7 బ్లాకులు..

చమురు నిక్షేపాల తవ్వకాల్లో రిలయన్స్




న్యూఢిల్లీ: ఓపెన్ ఏకరేజ్ లైసెన్స్ పాలసీ(ఓఏఎల్‌పీ)లో భాగంగా ప్రభుత్వ రంగ దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) 7 బ్లాకులను గెలుచుకుంది.

ప్రయివేట్ రంగ కన్సార్షియం రిలయన్స్-బీపీ, ఇంధన రంగ పీఎస్‌యూ ఆయిల్ ఇండియా, సన్‌పెట్రోకెమికల్స్ ఒక్కో క్షేత్రం చొప్పున సాధించాయి.

చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తికి సంబంధించి 8వ రౌండ్‌లో భాగంగా 10 బ్లాకులను ఆఫర్ చేసినట్లు చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పేర్కొన్నారు. వెరసి ఓఏఎల్‌పీ-8లో తాజాగా 10 బ్లాకులకు సంతకాలు జరిగినట్లు వెల్లడించారు. ఇదేసమయంలో మూడు కోల్‌బెడ్ మిథేన్(సీబీఎం) బ్లాకులను సైతం కేటాయించినట్లు తెలియజేశారు. అంతేకాకుండా ఓఏఎల్‌పీ-9వ రౌండ్ బిడ్డింగ్‌కు తెరతీసినట్లు తెలియజేశారు.తాజాగా ఆఫర్ చేసిన బ్లాకుల అన్వేషణ కార్యకలాపాలకు 23.3 కోట్ల డాలర్ల పెట్టుబడులు వెచ్చించవచ్చని భావిస్తున్నట్లు అధికారిక నోట్‌లో చమురు శాఖ పేర్కొంది. 2022 జులైలో ఓఎల్ఏపీ-8వ రౌండ్‌కు బిడ్డింగ్‌ను తెరిచిన సంగతి తెలిసిందే. చమురు శాఖ మొత్తం 10 బ్లాకులను ఆఫర్ చేసింది. పలు దఫాలు గడువు తేదీని సవరించాక 2023 జులైలో బిడ్డింగ్‌ను ముగించింది. హైడ్రోకార్బన్స్ డైరెక్టరేట్ జనరల్(డీజీహెచ్) వివరాల ప్రకారం ఓఎన్‌జీసీసహా వేదాంతా లిమిటెడ్, ఆయిల్ ఇండియా, సన్ పెట్రోకెమికల్స్, రిలయన్స్-బీపీ ఎక్స్‌ప్లొరేషన్(అల్ఫా) ఉమ్మడిగా 13 బిడ్స్ దాఖలు చేశాయి.బిడ్స్ తీరిలా కేంద్ర ప్రభుత్వం ఆఫర్ చేసిన 10 బ్లాకులలో ఏడింటికి ఒక్కొక్క బిడ్ దాఖలుకాగా.. మిగిలిన మూడు క్షేత్రాలకు రెండేసి బిడ్స్ లభించాయి. గ్లోబల్ ఇంధన దిగ్గజాలు ఎక్సాన్‌మొబిల్, షెవ్రాన్, టోటల్‌ఎనర్జీస్ బిడ్ చేయలేదు. మొత్తం 9 బ్లాకులకు బిడ్ చేసినఓఎన్‌జీసీ 6 బ్లాకులకు ఒంటరిగా రేసులో నిలిచింది. రిలయన్స్-బీపీ కేజీ బేసిన్‌లోని లోతైన సముద్రగర్భ బ్లాక్‌కు బిడ్ వేసింది. దశాబ్ద కాలంగా భాగస్వామ్యాన్ని కొనసాగిస్తున్న రిలయన్స్-బీపీ గత ఓఏఎల్‌పీ రౌండ్లలోనూ ఒక బ్లాకును గెలుచుకున్నాయి.చమురు దిగుమతుల బిల్లును తగ్గించుకునే లక్ష్యంతో ప్రభుత్వం 2016లో ఓఏఎల్‌పీకి తెరతీసింది. తద్వారా చమురు సంస్థలు ఇంధన అన్వేషణకు గుర్తించిన ప్రాంత పరిధిని దాటి ఏ ఇతర ప్రాంతాన్నయినా ఎంపిక చేసుకునేందుకు వీలు కల్పించింది. ప్రత్యేక సీబీఎం బిడ్ రౌండ్-2022లో భాగంగా 3 బ్లాకుల కేటాయింపునకు సంతకాలు పూర్తయినట్లు మంత్రి హర్‌దీప్ సింగ్ తెలిపారు.

# ఇండియా కూటమిలో సీట్ల పంచాయితీ..

ఢిల్లీ: ఇండియా కూటమి మిత్రపక్షాల ఒత్తిడితో కాంగ్రెస్ ఎట్టకేలకు సీట్ల పంపకాలపై మరో నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా సీట్ల పంపకం, సర్దుబాట్ల కోసం పార్టీ నేతలు మిత్రపక్షాలకు చేరువవుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.సీనియర్ నేత ముకుల్ వాస్నిక్ వివిధ ప్రతిపక్ష పార్టీల అధినేతలకు ఫోన్ చేసి మాట్లాడినట్టు సమాచారం. అంతేకాకుండా అవసరమైతే, ప్రతిపక్ష నేతలను కూడా కలవడానికి కాంగ్రెస్ నేతలు రాష్ట్రాలకు వెళ్లనున్నట్టు తెలుస్తోంది.ఇక, జనవరి 14న ప్రారంభం కానున్న రాహుల్ గాంధీ భారత్ న్యాయ్ యాత్రకు ముందే సీట్ల పంపకాల ఒప్పందాలను ఖరారు చేయాలని పార్టీ భావిస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. భారత్ న్యాయ్ యాత్రతోనే కాంగ్రెస్ తన ప్రచారాన్ని కొనసాగించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్టు సమాచారం.

# ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల: కందుకూరు

5 నుంచి ఆంధ్ర కేశరి విశ్వవిద్యాలయం స్పాట్ వాల్యేషన్ క్యాంప్

కందుకూరు(నేటితరం):ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం మొదటి సంవత్సరపు స్పాట్ వేల్యేషన్ క్యాంపు టీ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నుండి ప్రారంభంకానున్నదని కళాశాల ప్రిన్సిపాల్ డా.రవి కుమార్ తెలియజేశారు. లాంగ్వేజెస్ (ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం) సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనం ప్రారంభమవు తుందన్నారు.కందుకూరు, సింగరాయకొండ, ఉలవపాడు, కనిగిరి, పామూరు, సీ యస్ పురం, కొండేపి లకు చెందిన ప్రభుత్వ మరియు ప్రైవేటు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు తమ స్పాట్ వేల్యే షన్ ఆర్డర్స్ లను తీసుకొని క్యాంప్ ఆఫీసర్ కు రిపోర్టు చేయవల్సి ఉంటుందని తెలియజేశారు.

# ఎస్టియు వజ్రోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ




కందుకూరు (నేటితరం): ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న ఎస్టియు ఉపాధ్యాయుల సంగం 75 వసంతాలు సందర్భంగా వజ్రోత్సవ సంబరాలు జరుపుక వడం అభినందనీయమని కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి తెలిపారు గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఆయన చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఎస్టియూనాయకులు పాల్గొన్నారు.

# రూ.10 వేలకోట్లు అప్పు చేసిన 'రిచ్‌డాడ్ పూర్‌డాడ్' పుస్తక రచయిత.. కారణం ఇదేనా..



రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తకం అన్న వెంటనే చాలా మందికి ఆర్థిక పాఠాలు, గుడ్ డెట్-బ్యాడ్ డెట్, స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు, వాటి ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి, వ్యాపారం..ఇలా చాలా అంశాలు గుర్తుకొస్తాయి. 1997లో ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ పుస్తకం దాదాపు 4 కోట్ల కాపీలు అమ్ముడైంది. అయితే ఈ పుస్తకం రచయిత రాబర్డ్‌టి కియోసాకి ప్రస్తుతం అప్పుల్లో ఉన్నారంటూ ఆయనే స్వయంగా చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆయన ఎందుకు అప్పు చేయాల్సి వచ్చిందో ఈ కథనంలో తెలుసుకుందాం.
రాబర్ట్‌టి కాయోసా ఇన్‌స్టా వేదికగా ఓ రీల్ పోస్ట్ చేశారు. అందులో ఆస్తులు, రుణాల మధ్య వ్యత్యాసం గురించి మాట్లాడారు. 'మన చుట్టూ ఉన్నవాళ్లు చాలా మంది విలాసాల కోసం అప్పు చేస్తారు. కానీ నేను మాత్రం ఆస్తులను కొనడానికి అప్పు చేస్తాను. ఫెరారీ, రోల్స్ రాయల్స్ వంటి విలాసవంతమైన వాహనాలు అప్పు. అవి ఆస్తులు కావు. సంపాదనను డబ్బు రూపంలో ఆదా చేయను. ఆ మొత్తాన్ని వెండి, బంగారం రూపంలో మారుస్తాను. పెట్టుబడుల్లో భాగంగా నేను చేసిన అప్పు 1.2 బిలియన్ డాలర్ల(రూ.10 వేల కోట్లు)కు చేరింది' అని ఆయన చెప్పారు. పెట్టుబడుల రూపంలో తాను చేసిన అప్పే ఆయన ఆస్తి అని కియోసాకి అన్నారు.కియోసాకి తన పుస్తకంలో పెట్టుబడులకు సంబంధించి వివరంగా చెప్పారు. అత్యవసర వస్తువులు, అవసరమైన వస్తువులు, అనవసరమైన వస్తువులు అంటూ విభజించుకుని డబ్బు వెచ్చించాలని చెప్పారు. డబ్బును మరింత పెంచేలా పెట్టుబడిపెట్టేందుకు చేసే రుణాలు గుడ్ డెట్ అని ఆయన రాశారు. డబ్బు ఖాళీగా బ్యాంక్ ఖాతాల్లో ఉండడంకంటే మంచి రాబడులు వచ్చే మార్గాల్లో ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. స్టాక్‌మార్కెట్‌లో డివిడెంట్ ఇచ్చే స్టాక్‌ల్లో పెట్టుబడి పెట్టాలని, మార్కెట్ ఒడుదొడుకులను లోనైతే బంగారం, రియల్ ఎస్టేట్‌లో మదుపు చేయాలని ఆయన తన పుస్తకంలో రాశారు.

# కేపీహెచ్బీలో నెక్సస్ మాల్ లో సినీతారల సందడి




కూకట్ పల్లి (జనవరి 04):- కేపీహెచ్బీ నెక్సెస్ మాల్లో బుదవారం సినీతారలు సందడి చేశారు.
బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఇక్కడ నిర్వహించిన బంపర్ డ్రాలో నటుడు హర్షవర్ధన్ రాణే, తారలు మానస వార జాసి, తేజస్విని మాదివాడ, ప్రగన్య అయ్యగారి పాల్గొని లక్కీ కూపన్లు తీసి రూ.50 లక్షలు మరియు 30 ఆల్టో కే10 కార్ల విజేతలను ప్రకటించారు.
సెలెబ్రిటీల సెల్ఫీల కోసం యువతి యువకులు పోటీ పడ్డారు.
భర్త చనిపోయిన మహిళ పై మరిది లైంగిక వేదింపులు

# పోలీసులు న్యాయం చేయడం లేదని బాధితురాలు ఆవేదన

**భాదిత మహిళకు న్యాయం చేయాలంటున్న స్థానికులు**






సనత్నగర్ (జనవరి 04):- సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫతే నగర్ డివిజన్ పార్థవ బస్తిలో ఆలస్యంగా వెలుగు లోకి వచ్చిన ఘటన చాలా ఆలస్య ంగా చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్ళితే ఫతే నగర్ డివిజన్ లోని పార్థవ నగర్ లో నివాసముంటున్న కె మాదవి గత కొన్ని సంవత్స రాలుగా తన సొంత ఇంటిలో ఉంటుంది. కాగా తన భర్త ఉండగానే తన వదిన మీద కన్నేసిన మరిది విశాల్ శారీరకంగా మరియు మానసికంగా వత్తిడికి గురి చేసాడు.అన్న బ్రతికుండా గానే ఇంత దారుణానికి వడిగట్టిన మరిది అన్న చనిపోయాక ఇంకా వత్తిడికి గురి చేసాడు. శారీరకంగా మరియు లైంగికంగా వేధించేవాడు. దానికి వదిన ససేమీరా అనడంతో మరిది తెలివిగా తన అమ్మను రంగములో దింపి తన అమ్మతో వదినను మానసికంగా హింసించమని గొడవ పెట్టుకోమని వత్తిడి చేసేవాడు. దాంతో తల్లి కనికరం లేకుండా కోడలు (కె మాదవి) ని తరచు వేధించేది. 2023 డిసెంబర్ 31 అర్ధరాత్రి మద్యం సేవించి కోడలును చావా బాదారు. అది తెలిసిన ఇరుగు పొరుగు వారు చూసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి పిర్యాదు చేయించిన ఫలితం లేక పోయింది. దాంతో చేసేది ఏమి లేక మీడియాను ఆశ్రయించి తన గోడును వివరించారు. ఆమెతో కలిసి బస్తి వాసులు అందరు కలిసి ఏకమై ఒంటరిగా మిగిలిన బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


## షర్మిల కాంగ్రెస్ పార్టీ లో చేరడం శుభ పరిమాణం

కందుకూరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సోదరి, వైయస్సార్ టి.పి.అధ్యక్షురాలు షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం పట్ల చింతర బోయిన నరేష్ ఆనందం వ్యక్తం చేశారు . జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మీద అభాండాలు మోపి తన చీకటి వ్యాపారాలు చేయడానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ తో చేతులు కలిపి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని పేర్కొన్నారు. నిజాలు తెలుసుకున్న షర్మిల దేశంలో అతి పెద్ద లౌకిక వాద ప్రజాస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం శుభ పరిమాణం అని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పార్టీకి దూరంగా ఉన్న నాయకులు మేదావులు ప్రజాస్వామ్య వాదులు అందరూ పార్టీలోకి రావాలని కోరుతూ, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన ను ఇంటికి పంపి , కాంగ్రెస్ పార్టీని అంధ్రప్రదేశ్ లో అధికారంలోకి తీసుకొని వచ్చే దానికి ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని ఆయన పేర్కొన్నారు.

# మహిళ దారుణ హత్య

కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పరిధిలోని ఉన్న చుట్టుగుంటలోమహిళ దారుణ హత్య వెలుగు చూసింది.
మందలపు శేషమ్మ 72 ను గొంతు కోసి దారుణంగా హత్య చేశారని సీఐ నఫీజ్ భాష వెల్లడించారు .హత్య చేసిన తరువాత మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి తాళం వేసి వెళ్లారు .ఇరుకు పొరుగు వారికి అనుమానం వచ్చి బుధవారం రాత్రి తాళం పగలగొట్టడంతో దారుణం వెలుగు చూసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# గుంటూరు కారంలో మీనాక్షి లుక్ విడుదల


'గుంటూరు కారం'లో ఇద్దరు హీరోయిన్లు ఉన్నారు. అయితే... ఇప్పటి వరకు శ్రీ లీల మాత్రమే హైలైట్ అవుతూ వచ్చారు. 'కుర్చీ మడతపెట్టి...' పాట గానీ, అంతకు ముందు వచ్చిన 'ఓ మై బేబీ'లో గానీ సూపర్ స్టార్ మహేష్ బాబుతో పాటు ఆమె స్టెప్పులు వేశారు. సినిమాలో శ్రీ లీలతో పాటు మరొక హీరోయిన్ కూడా ఉన్నారు. ఇవాళ ఆమె లుక్ విడుదల చేశారు. గుంటూరు కారం' సినిమాలో మహేష్ బాబు సరసన మరొక కథానాయికగా మీనాక్షి చౌదరి నటించారు. ఇవాళ ఆమె ఫస్ట్ లుక్ విడుదల చేశారు. రాజీ పాత్రలో ఆమె నటిస్తున్నట్లు తెలిపారు. రమణ పాత్రలో మహేష్ నటిస్తున్న సంగతి తెలిసిందే. రమణతో రాజీ అంటూ లుక్ విడుదల చేశారు. టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, శ్రీలీలా ప్రధాన పాత్రల్లో వస్తున్న తాజా చిత్రం గుంటూరు కారం టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన 'కుర్చీ మడతపెట్టి..' పాట పర్‌ఫెక్ట్ మాస్ నంబర్‌గా ఆకట్టుకుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో ఈ సినిమాకు సంబంధించిన లేటెస్ట్ అప్‌డేట్‌ల కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. తాజాగా ఈ మూవీ నుంచి మేకర్స్ మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో మీనాక్షి చౌదరి లంగావోణీలో ఉండగా.. మహేష్ భుజంపై చేతులు వేసి క్యూట్ లుక్‌లో కనిపిస్తుంది.




# రవితేజ ఈగిల్ విడుదల వాయిదా పడిందా?

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం ఈగల్ సంక్రాంతి బరినుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. కార్తీక్ ఘట్టమనేని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక ఈ మూవీలో అనుపమపరమేశ్వరన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.

. కావ్య థాపర్ మరో కీలక పాత్రలో నటిస్తోంది. సంక్రాతి కానుకగా ఈ సినిమాను జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో ఈ సినిమాకు సంబంధించిన లేటెస్ట్ అప్‌డేట్‌ల కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈగల్ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈగల్ సినిమాకు సెన్సార్ బోర్డ్ యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. ఇక ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ ఒక్క కట్ కూడా చెప్పకపోవడం విశేషం. అయితే ఈ సినిమా వాయిదా పడనున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఈ విషయమే సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇప్పటికే సంక్రాంతికి బాక్సాఫీసు వద్ద మహేష్ బాబు 'గుంటూరు కారం', వెంకటేష్ 'సైంధవ్' సినిమాలు థియేటర్‌లు బుక్ చేసుకోగా.. ఉన్న కొన్ని థియేటర్‌లను 'హనుమాన్' దక్కించుకున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఈగల్ విడుదల అవ్వడం ఆ మూవీకి పెద్ద మైనస్ అవుతుందని.. దీనిని వాయిదా వేసుకోవడమే బెటర్ అని నిర్ణయించినట్లు చెపుతున్నారు.





# నేడు విడుదల కానున్న భీమా టీజర్

టాలీవుడ్ మాచో స్టార్ గోపీచంద్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం 'భీమా'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు కన్నడ దర్శకుడు ఏ హర్ష దర్శకత్వం వహిస్తుండగా.. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి మోషన్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయగా.. అభిమానుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ అప్‌డేట్ ఇచ్చిన విషయం తెలిసిందే. భీమా టీజర్‌ను ఈ నెల 5న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. తాజాగా ఈ టీజర్ టైంను కూడా చిత్రబృందం ప్రకటించింది.

రేపు మధ్యాహ్నం 1.11 గంటలకు టీజర్‌ను వదలనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సినిమాలో గోపీచంద్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తుండగా.. శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. 'సలార్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నాడు.

# పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కాజల్



స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. ఇందులో కాజల్ అగర్వాల్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్కా సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ అప్డేట్ ఇచ్చారు. నవంబర్, డిసెంబర్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుందీ సినిమా. ఈ సినిమాకు సంబంధించిన భారీ షెడ్యూల్‌ను కంప్లీట్ చేసినట్లుగా మేకర్స్ తెలిపారు. 35 రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్‌తో సినిమా చిత్రీకరణ 90శాతం పూర్తయ్యింది. ఈ షెడ్యూల్‌లో హ్యూజ్ యాక్షన్ సీన్స్‌ను కాజల్ అగర్వాల్‌పై ÷ట్ మాస్టర్ సుబ్బు చిత్రీకరించినట్లుగా మేకర్స్ ప్రకటించారు. కాజల్ గతంలో ఎప్పుడూ కనిపించని యాక్షన్ మోడ్‌లో ఈ 'సత్యభామ'లో కనిపించబోతోంది. కాజల్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఎంతో శ్రమించి ఈ యాక్షన్ సీక్వెన్సులు కంప్లీట్ చేసిందని.. సినిమాలో ఈ పోరాట ఘట్టాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని టీమ్ నమ్ముతోంది. ఇక ఈ సినిమా బ్యాలెన్స్ షూటింగ్ కంప్లీట్ చేసి త్వరలోనే ప్రమోషన్స్‌ను, అలాగే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

# హనుమాన్ ప్రీ రిలీజ్ వేడుకులకు అంజనీపుత్రుడు




జాంబిరెడ్డి ఫేమ్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'హనుమాన్' భారతీయ ఇతిహాసాల్లోని హనుమంతుని కథ స్ఫూర్తితో ఇండియన్ తొలి ఒరిజినల్ సూపర్‌హీరో మూవీగా ఈ చిత్రం రానుంది. తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. కె.నిరంజన్ రెడ్డి నిర్మాత. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇక తెలుగు, తమిళంతో పాటు దాదాపు 12 భాషల్లో ఈ సినిమాను గ్రాండ్ లెవల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్‌లో పెద్ద ఎత్తున ప్రీ రిలీజ్ వేడుకను ఎ÷-లాన్ చేశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన టీజర్, ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లకు ఊహించని స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది. దాంతో ప్రీ రిలీజ్ వేడుకను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. దానికోసం హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ హాల్‌ను ఎంచుకున్నారు. ఈ నెల7న మెగా ప్రీ-రిలీజ్ ఉత్సవ్ పేరిట ఈ వేడుక జరుగనుండగా.. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా రాబోతున్నాడు. ఈ విషయాన్ని మేకర్స్ సోషల్ మీడియాలో అధికారికంగా వెల్లడిస్తూ.. కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు.